క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: తహసీల్దార్ కార్యాలయాన్ని ఖమ్మం ఆర్డీఓ గణేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టండి



పీఆర్ చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ సంజీవయ్యకు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి కలిసి వినతిపత్రం అందించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

కట్లేరు వరదను పరిశీలించిన తహసీల్దార్

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు – తక్కెళ్లపాడు గ్రామాల మధ్య కట్లేరు వరదను సోమవారం మండల తహసీల్దార్ ఉషాశారద, ఎస్సై వెంకటేష్, ఎంపీడీఓ సురేందర్‌నాయక్, డాక్టర్ శశిపూర్ణలు పరిశీలించారు. ఈ ప్రాంతంలోనే గత ఏడాది వరదల సమయంలో రోడ్డు కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో అక్కడ పరిస్థితిని విచారించేందుకు అధికారులు పరిశీలించారు.

బీసీ కులగణన చేపట్టాలి

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని బీఆర్‌ఎస్ మైనార్టీసెల్ జిల్లా నాయకుడు షేక్.గౌసుద్దీన్ తెలిపారు. సోమవారం కారేపల్లిలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీసెల్ నాయకులు ఖలీలుల్లా ఖాన్, సద్దాం, ఫిరోజ్, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల పరిశుభ్రతపై అవగాహన

మధిర: కళాశాల పరిశుభ్రతపై సోమవారం విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ బి.జయదాస్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంలో భాగంగా కోఆర్డినేటర్ తౌరియా ఆధ్వర్యంలో కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు.

మహాకవి దాశరథి జయంతి

వైరా: తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. సోమవారం వైరా సీపీఎం స్టడీ సర్కిల్‌లో దాశరథి శత జయంతి ఉత్సవాలు నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. కరువు కాటకాలు లేని సమాజం కోసం పోరాడిన యోధుడు దాశరథి అన్నారు. ఈ కార్యక్రమంలో తోట నాగేశ్వరరావు, వడ్లమూడి మధు, కోట ప్రేమ్‌కుమార్, రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

వైరారూరల్: మండలంలోని గన్నవరం జెడ్పీ హెచ్‌ఎస్‌లో సోమవారం ఎస్‌ఏ తెలుగు ఉపాధ్యాయుడు పి.భాస్కర్ అధ్యక్షతన దశరథి కృష్ణాచార్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం కృష్ణామాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కారేపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంరాథోడ్ నాయక్, వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం కారేపల్లి బీజేపీ కార్యాలయంలో.. బీజేపీ మండలాధ్యక్షుడు మేకల మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీను, మండల అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, నాయక్, మాన్సింగ్, సుజాత, కిషన్, రామ్మూర్తి, శ్రీకాంత్, దేవా, గని, తరుణ్, విగ్నేష్, కరణ్, రాజ్‌కుమార్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా జరభద్రం



విద్యుత్ మోటార్ వద్ద రైతులు

- ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్‌తో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఏమరుపాటుగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి
- సలహాలు, సూచనలు చేస్తున్న విద్యుత్ అధికారులు

మధిర: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురియడంతో వ్యవసాయ క్షేత్రాల్లో వానాకాలం పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. పొలం పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు బిజీబిజీగా మారారు. పంట పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు, విద్యుత్ స్తంభాలు, సపోర్టు తీగలతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. కావున రైతులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అజాగ్రత్తగా ఉంటే విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

వివరాలిలా..

విద్యుత్‌శాఖ వైరా డివిజన్ పరిధిలో మొత్తం 15 సబ్ స్టేషన్లు ఉన్నాయి. మధిర సబ్ డివిజన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో 10,341 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అదేవిధంగా వైరా సబ్ డివిజన్ పరిధిలోని వైరా, బోనకల్ మండలాల్లో 5,278 కనెక్షన్లు ఉన్నాయి.

ప్రమాదాల భారీన ప్రజలు..

వైరా డివిజన్ పరిధిలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు విద్యుత్ ప్రమాదాల వల్ల ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించారు. అదేవిధంగా 27 గేదెలు మృత్యువాతకు గురికాగా రూ.10.80 లక్షలు బాధిత కుటుంబాలకు నష్టపరిహారంగా చెల్లించారు.

ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే ఎక్స్‌గ్రేషియా..

విద్యుత్ ప్రమాదాల వల్ల మరణిస్తే మనుషులకు రూ.5లక్షలు, మూగజీవాలకు రూ.7వేల నుంచి రూ.40వేల వరకు ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు. దీనికోసం మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్‌ఐఆర్ కాపీ, పోస్టుమార్టమ్ రిపోర్ట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సంబంధిత సెక్షన్ ఏఈకి దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులపై డీఈ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయ మోటార్ బోర్డు, స్టార్టర్లు వర్షానికి తడవకుండా అమర్చుకోవాలి.
- బోరు మోటార్లను ఆన్, ఆఫ్ చేసే సమయంలో చేతులు తడిగా లేకుండా చూడాలి. తప్పనిసరిగా గ్లౌస్ వాడాలి.
- మోటార్లకు మరమ్మతులు నిర్వహించే సమయంలో విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఎల్‌సీ తప్పనిసరిగా తీసుకోవాలి.
- రైతులు ఎప్పుడూ తమవెంట నాణ్యమైన టెస్టర్, కాళ్లకు పాదరక్షలు వేసుకొని విద్యుత్‌ను చెక్ చేయాలి.
- పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతుంటే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త, చెదారం లేకుండా చూసుకోవాలి.
- పిడుగులు పడే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- విద్యుత్ సమస్యలు వస్తే స్థానిక విద్యుత్‌శాఖ లైన్‌మెన్, ఏఈలకు వెంటనే సమాచారం అందించాలి.

విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు

వైరా డీఈఈ	7901093942
మధిర ఏడీఈ	9440811533
వైరా ఏడీఈ	8331034988
మధిర పట్టణ ఏఈ	9440811552
మధిర రూరల్ ఏఈ	9491058652
ఎర్రుపాలెం ఏఈ	9440814144
మామునూరు ఏఈ	9440628592
వైరా పట్టణ ఏఈ	9440814140
వైరా రూరల్ ఏఈ	7901678200
బోనకల్ ఏఈ	9440814143

ఫిర్యాదు చేయండి..



పంట పొలాల్లో విద్యుత్ సమస్యలు వస్తే సంబంధిత ఏఈలకు గాని, లేదా లైన్‌మెన్‌లకు గాని సమాచారం ఇచ్చి మరమ్మతులు చేయించుకోవాలి. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్‌ను ఆశ్రయించి ప్రమాదాలను కొరితెచ్చుకోవద్దు. మీ ప్రాంతాల్లోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించకపోతే మీ సమీపంలోని డీఈ, ఏడీఈ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయాలి. ప్రమాదాల నివారణకై విద్యుత్‌శాఖ భద్రతాపరమైన సలహాలు, సూచనలు తప్పక పాటించాలి.

– ఎస్.కృష్ణ, డీఈఈ, వైరా డివిజన్

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

ఏన్కూరు: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. సోమవారం పామాయిల్ రైతులకు స్థానిక మార్కెట్‌యార్డులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాల్లో రైతులు పామాయిల్ సాగు అధికంగా చేస్తున్నారని, ఈ సాగుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందన్నారు. నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, ఈ పంటసాగుకు కావాల్సిన సౌకర్యాలను కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. గోద్రేజ్ కంపెని రైతులకు అందుబాటులో సమాధాన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వీటి ద్వార ఆయిల్‌పాం రైతులకు కావాల్సిన పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గోద్రేజ్ ఆయిల్‌పాం అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ చావా వెంకటేశ్వరరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్వీటి, మేనేజర్ రామకృష్ణ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బీవీ రమణ, ఎఫ్ఓ దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, గుత్తా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు కృష్ణవేణి, లచ్చిరామ్‌నాయక్, నరేందర్, ధర్మారావు, నవీన్, నాగేశ్వరరావు, లెనిన్, రాంబాబు, ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

వేంసూరు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు నమోదవుతున్నాయని, అయినా.. వైద్యశిబిరాలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించగా.. మందులు కావాలంటే హెటిరో డ్రగ్స్ అధినేత బండి పార్థసారధిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో డ్రెయినేజీల్లో మురుగునీరు నిలిచి దోమల వ్యాప్తి పెరుగుతుందని, ఫాగింగ్, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొడ్డా శ్రీలక్ష్మీ వెంకటకృష్ణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీఓ రంజిత్ కుమార్, ఏఓ రాంమోహన్, ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు, వేంసూరు సొసైటీ చైర్మన్ గోపాలకృష్ణ, ఎంపీటీసీలు నాయుడు వెంకటేశ్వరరావు, జాన్సీలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ సంజీవరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



వీడ్కోలు పత్రాలు అందజేస్తున్న డాక్టర్ వీరబాబు

మధిర: విధి నిర్వహణలో ఎక్కడ పనిచేసినా రోగులకు మెరుగైన సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని మాటూరుపేట వైద్యాధికారి వీరబాబు సూచించారు. మధిర మండలం మాటూరుపేట పీహెచ్‌సీలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వైద్య సిబ్బందికి సోమవారం వీడ్కోలు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం అన్నారు. మాటూరులో పనిచేసిన సత్యవాణి దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌కి బదిలీ కాగా, మహదేవపురం, మర్లపాడులో పనిచేసిన మరియమ్మకి సుబ్లేడు పీహెచ్‌సీ సబ్ సెంటర్‌కి బదిలీ అయ్యారు. ఆత్కూర్‌లో పనిచేసిన టి.సరస్వతి వైరా పీహెచ్‌సీ పరిధిలోని వైరా ఆరోగ్య ఉప కేంద్రానికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఊటుకూరి భాస్కర్ రావు, మరియరాణి, నర్సింగ్ ఆఫీసర్ రజిత, డేటా ఎంట్రీ ఆపరేటర్ కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

చింతకాని: చింతకాని మండలం లచ్చగూడెం ఉన్నత పాఠశాలను ఖమ్మం అసిస్టెంట్ మ్రినాల్ శ్రేష్ఠ సోమవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యాన నిర్మించిన డిజిటల్ తరగతి గది, తాగునీటి ట్యాంకు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆయన ఫిజిక్స్, గణితం సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అలాగే మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీయడమే కాక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం సందర్శించి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం వివరాలు తెలుసుకున్నారు. ఆతర్వాత మండల పరిషత్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ సందర్శించారు. ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, హెచ్‌ఎం మహ్మద్ హుస్సేన్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీరాంకుమార్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి



కొణిజర్ల: ఏఓ బాలాజీ

తల్లాడ/కొణిజర్ల/ఎర్రుపాలెం: కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జూన్ 28 వరకు కలిగి ఉన్న రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు ఎండి.తాజుద్దీన్, డి.బాలాజీ, కె.విజయ్‌భాస్కర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా పాస్‌బుక్ వచ్చిన రైతులు ఆగస్టు 5వ తేదీలోగా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్‌లు జత పర్చి దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఆధార్ కార్డ్‌లో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు వయస్సు ఉన్న రైతులు మాత్రమే బీమా చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఏఈఓలకు సమర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీ లబ్ధిదారులు రెన్యూవల్ చేసుకోవాలి

తల్లాడ: రైతు రుణమాఫీ లబ్ధిదారులు రెన్యూవల్ చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ వీరన్న తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. లక్షలోపు రుణాలు మాఫీ అయిన రైతులు ఆధార్‌కార్డ్, ఫొటోలు, వన్‌బీ పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని బ్యాంక్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం కొద్ది రోజుల తర్వాత కొత్త రుణాలివ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రారంభమైన 'శిక్షా సప్తాహ్'



ఏన్కూరు: శిక్షా సప్తాహ్ మేళాలో పాల్గొన్న విద్యార్థులు

ఏన్కూరు/కల్లూరురూరల్: జాతీయ విద్యా విధానం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా ఏన్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, కల్లూరులోని పేరువంచ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహిస్తామని ఏన్కూరు, పేరువంచ పాఠశాలల హెచ్‌ఎంలు కూరాకుల సైదయ్య, సీహెచ్ సుదర్శన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, ఎండీ మౌలాలి, శ్రీనివాస్ నాయక్, జ్యోతి విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పిల్లలకు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సత్యవేణి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐకేఆర్పీలు కేఏస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆశ కార్యకర్త నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలల్లో వంట బంద్

ఏన్కూరు: ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వంట బంద్ చేస్తున్నట్లు సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి వంట బంద్ చేసి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

బోనకల్: మండలంలోని చిన్న బీరవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. గ్రామంలో బ్లీచింగ్ వేయడంతో పాటు మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. తహసీల్దార్ పొన్నం చందర్, డాక్టర్ స్రవంతి, ఎంపీడీఓ రాజు, ఎంపీఈఓ టీవీఎల్‌ఎన్ శాస్త్రి తదితరులు ఉన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

మధిరరూరల్: నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్(ఎంఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు రత్నాకర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణాపురం సమీపంలో ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న ముదిగొండ గురుకుల బాలుర పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. హాస్టల్‌లో బెడ్లు ఏర్పాటు చేయాలని, డైనింగ్ హాల్లో బల్లాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కూరపాటి ప్రభాకర్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు పవన్ కల్యాన్, రత్నకుమార్, సుధీర్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

మధిరరూరల్: సిరిపురం హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన సాదినేని కృష్ణమూర్తి, దేవకి తనయుడు, కోడలు రాహుల్, వినీసఫర్నీచర్ వితరణ చేశారు. పాఠశాలకు ఇనుప బీరువా, టేబుల్, ఐరన్ రాక్, పిల్లలకు బ్యాగులు పంపిణీ చేశారు. ఎంఈఓ వై.ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ.. దాతల సహకారంతో విద్యార్థులు మంచిగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రెటరీ మురళీమోహన్, హెచ్‌ఎం ఎస్.కె బాబ్జి, విష్ణువర్ధన్ రెడ్డి, కొండలరావు, రాణి, ఇసాక్, శోభారాణి పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

కారేపల్లి: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని భాగ్యనగర్‌తండా గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాలోతు వీరన్న(30) ఇల్లెందులోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. తెల్లవారుజామున నిద్రలేచిన ఆయన బాత్‌రూం వెళ్లి వస్తుండగా ఛాతిలో నొప్పితో కుప్పకూలగా కుటుంబీకులు ఇల్లెందు తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య మౌనికతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు

ఎర్రుపాలెం: తన ఇంటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మండలకేంద్రానికి చెందిన మగినం వీరమ్మ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు, డీపీఓకు ఫిర్యాదు చేసింది. తాను బతికి ఉన్నంతకాలం ఇల్లు తన స్వాధీనంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని 33 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 5.25 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు పద్మజ్యోతి, రాంబాబు, కమల్‌పాష, గాదె చెన్నారావు, రఫి, పింగళి సామేలు, ఎండీ గఫార్ ఖాన్, చిల్లగల్ల వెంకటేశ్వరరావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మట్టా దయనంద్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, మార్కెట్ ధరకు అనుగుణంగా కోడిగుడ్డు ధర కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో చలమాల విఠల్, సర్వేశ్వరరావు, బాబు, జాజిరి శ్రీను, ధనలక్ష్మి, నేలమ్మ లక్ష్మీ రాధ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ముదిగొండ: మండలపరిధిలోని ముత్తారానికి చెందిన నారపొంగు సింహాద్రి ఆదివారం వనంవారికిష్టాపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడు మృతదేహాన్ని ముదిగొండ సహకార సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

గ్రామ కార్యదర్శుల మార్పు

సింగరేణి జీపీ కార్యదర్శి మంగళితండాకు బదిలీ

కారేపల్లి: సింగరేణి (కారేపల్లి) గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న యాకలక్ష్మి మండలంలోని మంగళితండా గ్రామపంచాయతీకి బదిలీ కాగా.. మంగళితండా కార్యదర్శి సింగరేణి జీపీకి బదిలీ చేస్తూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎం.రమేష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బాధ్యతలు స్వీకరించిన కార్యదర్శులు..



ఎంపీడీఓకు లేఖ ఇస్తున్న కార్యదర్శులు

కల్లూరురూరల్: సాధారణ బదిలీలలో భాగంగా కల్లూరు మండలం నుంచి 13 మంది పంచాయతీ కార్యదర్శులు వివిధ మండలాలకు బదిలీపై వెళ్లారు. సోమవారం కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యర్శులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చి ఆయా పంచాయతీలలో బాధ్యతలు చేపట్టారు. కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా ఎస్.నాగేశ్వరరావు, కొర్లగూడెం కార్యదర్శిగా రామ్‌ప్రసాద్, నారాయణపురం కార్యదర్శిగా నరసింహారావు, చంద్రుపట్ల కార్యదర్శిగా లక్ష్మణరావులు పదవీ బాధ్యతలు చేపట్టారు.

సత్తుపల్లి రూరల్ సీఐగా లింగయ్య



సీఐ ముత్తి లింగయ్య

పెనుబల్లి: సత్తుపల్లి రూరల్ సర్కిల్ సీఐగా ఎంఎల్ ముత్తి లింగయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి సత్తుపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు.

ముదిగొండ ఎంపీఓగా కిషోర్ బాధ్యతల స్వీకరణ



ఎంపీఓ కిషోర్

ముదిగొండ: ముదిగొండ ఎంపీఓగా వాల్మీకి కిషోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన పెగళ్లపాటి సూర్యనారాయణ బదిలీపై తిరుమలాయపాలెం వెళ్లగా.. పెనుబల్లి నుంచి కిషోర్ బదిలీపై ముదిగొండకు వచ్చారు.

తహసీల్దార్‌కు వినతి

కొణిజర్ల: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పడుతున్న ఇబ్బందులపై తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు వినతిపత్రం అందించారు. వర్షాలకు మండలంలోని బస్వాపురం బీసీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరుతున్నాయని, మొత్తం బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అధికారులకు తెలిపినా వారు తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పూర్తిస్థాయిలో నీరు బయటకు వెళ్లడం లేదని తహసీల్దార్‌కి తెలుపగా.. స్పందించి ఆయన కాలనీని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీజేపీ నాయకులు ..

బోనకల్: కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకుడు జంపాల రవి అన్నారు. మండలంలోని తహసీల్దార్ పొన్నం చందర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, పరుశురాం, రాధాకృష్ణ, సతీష్ కుమార్ తదితరులున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

తల్లాడ: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. సోమవారం తల్లాడలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో విలేకర్లతో మాట్లాడారు. రేషన్ ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందనే నిబంధనలు పెట్టడం సరైంది కాదన్నారు. జిల్లాలో ఐదులక్షల మంది రైతులుంటే.. లక్షలోపు రుణం తీసుకున్నవారు 57,375 మంది ఉన్నారనీ, ఆ లెక్కన చూసుకుంటే సుమారు 3 లక్షల మందికి రావాల్సి ఉందన్నారు. ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని.. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ సత్యనారాయణరెడ్డి, సీపీఎం మండల కన్వీనర్ రామలింగేశ్వరరావు, మోహన్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాలిపోయిన జనరేటర్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు నిర్వహించే ప్రాంతంలో సోమవారం జనరేటర్ ప్రమాదవశాత్తు కాలిపోయింది. లోడ్ ఎక్కువ కావడంతో కాలిపోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. ఆ సంఘటన మరువక ముందే ఇప్పుడు జనరేటర్ కాలి బూడిద అయ్యింది.

సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత

మధిర: మండలంలోని మడుపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ 8 సంవత్సరాల క్రితం ఉద్యమం చేసినప్పుడు 13 మంది సీపీఎం నాయకులపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సోమవారం మధిర జూనియర్ సివిల్ జడ్జి టి.కార్తీక్ రెడ్డి కొట్టివేశారు. ఈ కేసును న్యాయవాదులు దిరిశాల జగన్మోహన్ రావు, సతీష్ వాదించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసును కోర్టు కొట్టివేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలి

వేంసూరు: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నిర్మలకుమారి, రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, ఈశ్వరాచారి, శ్రీనివాసరెడ్డి, దీన్‌దయాల్, శిరీష, పాల్గొన్నారు.